
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





కొమురవెల్లి శివారులో నిర్మిస్తున్న రైల్వేస్టేషన్

మల్లన్న రైల్వేస్టేషన్ ఇక కొమురవెల్లి పుణ్యక్షేత్రం

● రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ

చేర్యాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న రైల్వేస్టేషన్‌ను ఇక నుంచి కొమురవెల్లి పుణ్యక్షేత్రం స్టేషన్‌గా పిలువనున్నారు. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ పరిధిలో కొత్తగా చేపట్టిన నాలుగుస్టేషన్లపేర్లను రైల్వే శాఖ అధికారికంగా ఖరారు చేసింది. ఈ మేరకు రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. కొమురవెల్లి గ్రామశివారులో చేపట్టిన హాల్ట్ స్టేషన్‌కు కొమురవెల్లి పుణ్యక్షేత్రంగా నామకరణం చేశారు. గతేడాది ఫిబ్రవరిలో హాల్ట్‌స్టేషన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేయడంతో పనులు కొనసాగుతున్నాయి. గత డిసెంబరులో జరిగిన కొమురవెల్లి మల్లన్న కల్యాణం నాటికి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పినప్పటికీ పనుల జాప్యంతో ఆలస్యమైంది. ఈనెల 31వరకు నిర్మాణ సమయం గడువు ముగియనుండగా, ప్రస్తుతానికి పనులు తుదిదశకు చేరుకున్నాయి. పనుల పూర్తికి సంబంధించి ఇంకా కొంతసమయం పట్టనుండడంతో వచ్చే జూన్‌లో ప్రారంభించేందుకు రైల్వేశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. స్టేషన్ పేరును కొమురవెల్లి పుణ్యక్షేత్రంగా ఖరారు చేసిన రైల్వేశాఖ ఉన్నతాధికారులు హాల్ట్‌స్టేషన్‌కే పరిమితం చేయకుండా ఉన్నతీకరించాలని, త్వరితగతిన స్టేషన్‌ను ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

మల్లన్న స్టేషన్‌గా కొనసాగించాలని భక్తుల వేడుకోలు

కోట్లాది మంది భక్తుల కల్పతరువైన మల్లికార్జునస్వామి వెలిసిన కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్న క్రమంలో పేరుమార్చకుండా మల్లన్న రైల్వేస్టేషన్‌గానే కొనసాగించాలని భక్తులు కోరుతున్నారు. దేవుడి పేరిట ఏర్పాటుచేసినందున మల్లన్న పేరుతోనే ఉండాలని అప్పుడే మరింత ప్రాచుర్యంలోకి వస్తుందన్నారు. ఈ విషయమై రైల్వేశాఖ ఉన్నతాధికారులు పునరాలోచించి కొమురవెల్లి పుణ్యక్షేత్రానికి బదులుగా కొమురవెల్లి మల్లన్నస్టేషన్‌గా కొనసాగించేందుకు తదుపరి చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట మున్సిపల్ బడ్జెట్ రూ. 75.19 కోట్లు

● వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన చైర్‌పర్సన్ మంజులరాజనర్సు

● ఆమోదం తెలిపిన పాలకవర్గం సభ్యులు

● ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ హాజరు

సిద్దిపేట టౌన్, మార్చి10(ఆంధ్రజ్యోతి): దేశ, రాష్ట్రస్థాయిలో సిద్దిపేట మున్సిపల్‌కు మంచి గుర్తింపు వచ్చిందని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో 2025-2026 సంవత్సరానికి సంబంధించిన రూ. 75.19 కోట్ల వార్షిక బడ్జెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సిద్దిపేట మున్సిపల్ కౌన్సిల్ మంచి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు సభ్యులు, అధికారులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని మిగతా మున్సిపాలిటీలకు సిద్దిపేట ఆదర్శంగా ఉండాలని సూచించారు. సిద్దిపేట మున్సిపాలిటీలో ప్రజాప్రతినిధులు, అధికారులందరూ కలిసి సమన్వయంతో పనిచేసి సిద్దిపేట పట్టణానికి మరిన్ని అవార్డులు తీసుకొచ్చేలా కృషి చేయాలన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీలో ప్రారంభించిన ఋతుప్రేమ కార్యక్రమం, స్టీల్ బ్యాంక్ నిర్వహణ దేశ స్థాయిలో మంచి గుర్తింపును సాధించాయని చెప్పారు. ఈ ఏడాది ఆస్తి, నల్లా పన్నులు వసూలు చేయడంలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. హరిత బడ్జెట్‌లో భాగంగా సిద్దిపేట మున్సిపాలిటీలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రత్యేక రూపకల్పనలు సిద్ధం చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు మాట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సహాయ సహకారాలు, కృషితో సిద్దిపేట పట్టణం రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు ఎప్పుడు ఆదర్శంగా ఉంటుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ మాట్లాడుతూ సిద్దిపేట మున్సిపాలిటీ అభివృద్ధిలో తాను ఒక భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు, మున్సిపల్ డీఈ ప్రేరణ పాండా, ఏఈలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి కోవర్టులను తరిమేస్తాం

● మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు 7

అదుపు తప్పి పాఠశాల బస్సు బోల్తా

● ఐదుగురు విద్యార్థులకు గాయాలు

నిరుపయోగం

● ప్రభుత్వ భవనాలకు మోక్షమేదీ? 8

సమ్మర్.. బీ కేర్ ఫుల్

● ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

● వడదెబ్బ తగలకుండా చూసుకుందాం

పండు.. ఆరోగ్యం దండు

7





జీవాలకు మేతగా వరి

తలాపునే తపాస్‌పల్లి రిజర్వాయర్ ఉన్నా సరిపడా నీరందక పంటలు ఎండిముఖం పడుతున్నాయి. దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులు పంటలను జీవాలకు మేతగా వదిలేశారు. చేర్యాల మండల కేంద్రం శివారులో నర్సయ్య అనే రైతు మూడెకరాల్లో వరిసాగు చేశాడు. బోరు ఉన్నా నీరు రాకపోవడంతో ఎకరం పూర్తిగా ఎండిపోయింది. పంటను వదిలిపెట్టడంతో గొర్రెల పెంపకందారులు మేపుకుంటున్నారు.

- చేర్యాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి)

నిద్రావస్థలో నిఘా

● రాజీవ్ రహదారిపై పనిచేయని కెమెరాలు

● తుప్పుపట్టి.. నేలవాలి వెక్కిరిస్తున్న వైనం

● ప్రమాదాలు జరిగిన తీరుపై విచారణలు జాప్యం

● జంక్షన్లు, యూటర్న్‌లు, గ్రామాల వద్ద ఇదే పరిస్థితి

● పర్యవేక్షణ లోపంతో భద్రత లేని ప్రాణాలు

● జిల్లాలో 90కి.మీలు విస్తరించిన రహదారి



రంగధాంపల్లి వద్ద సీసీ కెమెరా స్టాండ్

సిద్దిపేటలోని రంగీలా ధాబాల వద్ద రాజీవ్ రహదారిపై తుప్పుపట్టిన సీసీ కెమెరా

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మార్చి 10: "కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో డీఎస్పీ స్థాయి పోలీస్ అధికారి జవహర్‌లాల్ దుర్మరణం చెందారు. ఒక కారు కారణంగా పక్కనే ఉన్న హోర్డింగ్‌ను ఢీకొట్టినట్లు డ్రైవర్ వాంగ్మూలం ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు విచారణ జరుపుతూనే ఉన్నారు. ఈ జంక్షన్‌లో ఉన్న రెండు స్తంభాలకు గతంలో సీసీ కెమెరాలు ఉండేవి. కానీ ఇందులో ఒక స్తంభం విరిగిపోగా మరొకదానికి కెమెరా లేదు. సీసీ కెమెరాల నిఘా ఉంటే ఇప్పటికే విచారణ పూర్తికావడంతోపాటు తగిన కారణాలు కూడా బయటపడేవి"

నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న రాజీవ్‌రహదారిపై భద్రత కరువైంది. నిఘా యంత్రాంగం పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా ప్రమాదాలు జరగడంతో పాటు ఆ ప్రమాదాలకు దోహదం చేసిన కారణాలు సమయానికి తేలడం లేదు. సాంకేతికంగా టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న ఈ తరుణంలో రాజీవ్ రహదారిని సీసీ కెమెరాల కనుసన్నల్లో ఉండేలా చేసే వీలుంది. కానీ ఇప్పటికే అమర్చిన సీసీ కెమెరాలు చాలాచోట్ల నేలచూపులు చూస్తున్నాయి. మరికొన్ని తుప్పుపట్టి దర్శనమిస్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



సిద్దిపేటలోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద రాజీవ్ రహదారిపై రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనాలు

నిత్యం ప్రమాదాలే..

ములుగు జిల్లా వంటిమామిడి నుంచి బెజ్జంకి మండలం తోటపల్లి వరకు జిల్లాలో రాజీవ్ రహదారి విస్తరించి ఉంది. ములుగు, వర్గల్, గజ్వేల్, కుకునూరుపల్లి, కొండపాక, సిద్దిపేట అర్బన్, చిన్నకోడూరు, కోహెడ, బెజ్జంకి మండలాలకు సంబంధించిన పలు గ్రామాలు ఈ రహదారి పక్కనే ఉన్నాయి. వేల సంఖ్యలో వాహనాలు కరీంనగర్- హైదరాబాద్ నడుమ రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం రహదారి మరమ్మతుల కారణంగా ఇబ్బందులు తలెత్తుతూనే ఉంటాయి. ఇక మూలమలుపులు, జంక్షన్ల వద్ద ప్రమాదాలు జరగడం కూడా నిత్యకృత్యమే.

మిగతా 8వ పేజీలో

ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వద్దు

● కలెక్టర్ మనుచౌదరి

● 'ప్రజావాణి'కి 54 దరఖాస్తులు



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించొద్దని, ప్రజావినతులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ఆయన వినతులను స్వీకరించి మాట్లాడారు. మొత్తం 54 దరఖాస్తులను వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. వాటిని పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగ రాజమ్మ, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలి

గత ప్రభుత్వ తప్పిదమో, అధికారుల నిర్లక్ష్యమో మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్ లింకు కాలువకు భూములు ఇచ్చిన నాలుగు గ్రామాల రైతులకు ఇప్పటివరకు పరిహారం అందలేదని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూమిరెడ్డి తెలిపారు.. రోజురోజుకు పెరుగుతున్న ఎండలతో ఎండిపోతున్న పంటలను దృష్టిలో పెట్టుకొని రైతులకు ఆసరాగా కాల్వల ద్వారా నీరు అందించేలా చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ మను చౌదరికి రైతులతో కలిసి ఆయన వినతి పత్రాన్ని అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ హత్య



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

గజ్వేల్‌రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మహిళ హత్యకు గురైన సంఘటన గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడ సమీపంలోని పెట్రోల్‌పంపు వద్ద సోమవారం చోటుచేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ చర్లపల్లికి చెందిన ఆస్రాబేగం(45)కు అదే ప్రాంతానికి చెందిన సాదతుల్లాతో 30 ఏళ్ల వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. ఆస్రాబేగం న్యాయవాది దగ్గర అటెండర్‌గా, ఆమె భర్త ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగించేవారు. ఆస్రాబేగం విధులకు వెళ్లివచ్చే క్రమంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండూర్ పట్టణానికి చెందిన అస్లాంతో హైదరాబాద్‌లో పరిచయం ఏర్పడింది. నాలుగేళ్ల క్రితం ఆమె అస్లాంతో ఇండోర్‌కు వెళ్లింది. భార్య విడిచిపెట్టి వెళ్లిపోవడంతో సాదతుల్లా రిమ్మనగూడ పెట్రోల్ పంపు వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తూ ఒంటరిగా ఉంటున్నాడు. కొంతకాలానికి ఆస్రాబేగం, అస్లాం మధ్య గొడవలు జరిగాయి. రెండు నెలల క్రితం ఆస్రాబేగం ఇండోర్ నుంచి తిరిగి చర్లపల్లికి వచ్చి కుటుంబసభ్యులతో ఉంటుంది. అస్లాం ఆస్రాబేగానికి తరుచూ ఫోన్లు చేస్తూ ఇండోర్‌కు రావాలని వేధిస్తుండడంతో తాను రానని తేల్చి చెప్పింది. కూతురితో కలిసి ఫిబ్రవరిలో ఆస్రాబేగం ఇండోర్ వెళ్లి.. తనకు సంబంధించిన వస్తువులు అస్లాం వద్ద ఉన్నాయని పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసి తిరిగి చర్లపల్లికి వచ్చింది. ఫిర్యాదు చేసిన విషయం తెలుసుకున్న అస్లాం చంపేస్తానంటూ ఆస్రాబేగాన్ని తరుచూ బెదిరించేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఆస్రాబేగం ఇంటి నుంచి దుస్తులు తీసుకుని వెళ్లి ఆదివారం రాత్రి అస్లాంతో కలిసి మొదటి భర్త సాదతుల్లా వద్దకు రిమ్మనగూడ వచ్చింది. విషయాన్ని సాదతుల్లా తన కూతురుకు ఫోన్ చేసి చెప్పడంతో వారిని ఇంట్లోకి రానివొద్దని సూచించింది. ఈ ఒక్కరాత్రి ఉండి వెళ్లిపోతామని ఆస్రాబేగం బతిమిలాడడంతో సాదతుల్లా ఒప్పుకున్నాడు. మరుసటి రోజు తెల్లవారుజామునే అస్లాం, ఆస్రాబేగం గొడవపడ్డారు. మాటామాటా పెరిగి అస్లాం పారతో ఆస్రాబేగం ముఖంపై కొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. భయంతో అస్లాం అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పోటీ.. వామ్మో కోటి..!

'స్థానికం'పై నిరాసక్తత

● భయపడుతున్న ఆశావహులు

● రియల్ వ్యాపారం పడిపోవడమూ కారణం

● అప్పులు చేసినా తీర్చలేమని భయం

● గజ్వేల్ నియోజకవర్గంలో భిన్నపరిస్థితులు



గజ్వేల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలు వస్తున్నాయంటే పోటీ చేసేందుకు ఆశావహులు ఉవ్విళ్లూరుతుంటారు. నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తుంటారు. టికెట్ దక్కిన తర్వాత విజయం సాధించడానికి ఎంత ఖర్చు చేయడానికైనా వెనుకాడరు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి ఉంది. కానీ గజ్వేల్ నియోజకవర్గంలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. గతంతో పోలిస్తే ఎన్నికలు పోటీ చేసేందుకు ఆశావహులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఓ వైపు వ్యాపారాలు పడిపోవడం, మరోవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారం స్తంభించడంతో ప్రభుత్వం నుంచి నిధులు రాక, గత సర్పంచుల బిల్లులు పెండింగ్‌లో ఉండడం వల్ల ఆశావహులు పోటీ చేసేందుకు ఆసక్తి కనబర్చడం లేదు. గత ఎన్నికల్లో అధికార పార్టీ నుంచి పెద్ద ఎత్తున పోటీకి లైన్‌లో నిలబడిన అభ్యర్థులు ఈసారి మాత్రం నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు.

గజ్వేల్ నియోజకవర్గంలోని 175 గ్రామాలు, రెండు మున్సిపాలిటీలు, తొమ్మిది మండలాల పరిధిలో సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, మునిసిపల్ చైర్మన్లు, మున్సిపల్ వైస్ చైర్మన్లు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల పోస్టులు ఉంటాయి. వీటికి గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున పోటీ పడగా, ఈసారి పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. గతంలో పోటీ చేసిన వారు సైతం ఈసారి పోటీ చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు.

ఖర్చుతో కూడుకున్న పని..

సర్పంచ్ మొదలు ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్ స్థానాలకు పెద్దఎత్తున డబ్బు ఖర్చు అయ్యే అవకాశాలు కనిపిస్తుండడంతో ఆశావహులు పోటీకి భయపడుతున్నారు. స్థిరాస్తి వ్యాపారం పూర్తిగా దెబ్బతినడంతో ఆశావహులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు జంకుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేసి, అప్పుల పాలైతే తీర్చేది ఎలా అని మదన పడుతున్నారు. గత సర్పంచులకు భారీగా బిల్లులు పెండింగ్‌లో ఉండడం, ప్రస్తుత ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే మార్గం లేకపోవడం మరో సమస్యగా తెలుస్తోంది.

గతానికి భిన్నంగా పరిస్థితి

గజ్వేల్ నియోజకవర్గంలో ఆయా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు గత పర్యాయం అనేక మంది నాయకులు అధికార పార్టీ నుంచి పోటీపడ్డారు. ప్రస్తుత పరిస్థితిలో అటు అధికార పార్టీ నుంచి, ఇటు ప్రతిపక్ష పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఆశావహులు వెనుకడుగు వేస్తున్నారు. సర్పంచ్‌గా పోటీ చేస్తే దాదాపు రూ.20 నుంచి రూ. 40 లక్షలు, ఎంపీటీసీగా పోటీ చేస్తే రూ.30 నుంచి రూ. 50 లక్షలు, జడ్పీటీసీగా పోటీ చేస్తే కోటి రూపాయలకు పైగా ఖర్చు వస్తుందని ఇక్కడి నుంచి తెచ్చి పెట్టేదంటూ మదనపడుతున్నారు. ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు పెడితే పెద్దగా ఆసక్తి చూపెట్టని ఆశావహులు మరికొంత సమయం దొరికి పరిస్థితి మారితే మాత్రం ఆశావహుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి.

ఖేడ్‌లో విజిలెన్స్ అధికారుల దాడి

● 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

నారాయణఖేడ్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ ఉంచిన గోదాంపై సోమవారం విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశం ఆధ్వర్యంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి 60 బస్తాల్లో ఉన్న 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశం వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ పట్టణంలోని రాయిపల్లి రోడ్డులో శివరాం అనే బియ్యం వ్యాపారి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి తన దుకాణం వెనుక గోదాంలో నిల్వచేశాడు. పక్కా సమాచారం అందుకున్న డీఎస్పీ సీఐ పండరీ, ఎస్ఐ వెంకటేశం, తహసీల్దార్ ప్రభాకర్‌తో కలిసి దాడిచేసి 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, సీజ్ చేశామన్నారు. ఆర్ఐ మాధవరెడ్డి ద్వారా పంచనామా చేయించి బియ్యాన్ని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించి, నారాయణఖేడ్ పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించామన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి నిరసన

● ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం



ప్రియుడి ఇంటి ఎదుట నిరసన తెలియజేస్తున్న దివ్య

కౌడిపల్లి, మార్చి (ఆంధ్ర జ్యోతి) 10 : ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని మోసం చేయడంతో ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు సోమవారం నిరసన చేపట్టింది. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కూకట్లపల్లి గ్రామానికి చెందిన జజ్జరి దివ్య, ఇదే గ్రామానికి చెందిన గొల్ల అనిల్ కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే గతేడాది మార్చిలో కొల్చారం మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడితో దివ్యకు వివాహమైంది. ఇది జీర్ణించుకోలేని అనిల్ 'నువ్వు లేక నేను ఉండలేను.. పెళ్లి చేసుకుంటానని దివ్య ఫోన్‌కు తరచూ మెసేజ్‌లు చేసేవాడు. ఈ విషయం గమనించిన భర్త దివ్యకు విడాకులు ఇచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వచ్చిన దివ్య పెళ్లి చేసుకోవాలని పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించింది. రూ.20 లక్షల కట్నం, ఎకరం పొలం ఇస్తే పెళ్లి చేసుకుంటానని అనిల్ డిమాండ్ చేశాడు. దివ్య తల్లి కట్నం ఇస్తాము.. పెళ్లి చేసుకోవాలని ఒప్పందం చేసుకున్నారు. కొన్ని రోజులుగా నేనే మీకు రూ.26 లక్షలు పరిహారంగా ఇస్తాను.. కానీ పెళ్లి చేసుకోనని మొహం చాటేసి బంధువుల వద్ద ఉంటున్నాడు. ఆదివారం అనిల్ ఇంటికి వచ్చాడని సమాచారం తెలుసుకున్న దివ్య తల్లితో కలిసి సోమవారం అనిల్ ఇంటికెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేసింది. అనిల్ తల్లి భాగ్యమ్మ దివ్యపై దాడిచేసి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయింది. తనకు అనిల్‌తో వివాహం చేయాలని, లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని దివ్య ప్రియుడి ఇంటి ఎదుట నిరసనకు దిగింది. ఈ విషయమై గతంలో పలు మార్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

జోగిపేట రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. జోగిపేట ఎస్ఐ పాండు తెలిపిన వివరాల మేరకు సోమవారం సాయంత్రం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్‌హాల్ సమీపంలో ఉన్న చెట్లకింద ముగ్గురు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందడంతో దాడులు జరిపామని తెలిపారు. వీరి నుంచి రూ.16,250 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'ప్రజావాణి'కి 57 దరఖాస్తులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి/గుమ్మడిదల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సోమవారం జిల్లాలోని నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు 57 అర్జీలు సమర్పించారు. రెవెన్యూశాఖ 25, సర్వే ల్యాండ్ 7, పౌర సరఫరాల శాఖ 2, మార్క్‌ఫెడ్ 1, పంచాయతీ అండ్ పీటీ విభాగం 4, పంచాయతీరాజ్ 2, మునిసిపల్ 4, వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ 9, విద్యాశాఖ 2, వ్యవసాయశాఖ 1 చొప్పున దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ అర్జీపై తక్షణ చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్వో పద్మజరాణి వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ ప్యారానగర్ శివారులో ఏర్పాటు చేయనున్న డంపింగ్‌యార్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతారని, వాటిని దృష్టిలో పెట్టుకుని డంపింగ్‌యార్డు నిర్మాణాలు ఆపాలని కలెక్టర్ వల్లూరు క్రాంతికి గుమ్మడిదల జేఏసీ నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో విన్నవించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ చెప్పారు.



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రజావాణి అర్జీలకు పరిష్కారం చూపాలి: మెదక్ కలెక్టర్

మెదక్ అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణికి వచ్చే అర్జీలకు గుణాత్మక పరిష్కారం చూపాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 60 వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కొడుకులు అన్నం పెట్టడం లేదని వెల్దుర్తి మండలం ఉప్పలింగాపూర్ గ్రామానికి చెందిన దేశి కొమురయ్య, శివలక్ష్మి కలెక్టర్ ఎదుట వాపోయారు. వెంటనే స్పందించిన కలెక్టర్ బాధిత తల్లిదండ్రులకు చట్ట ప్రకారం న్యాయం చేయాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డిని ఆదేశించారు. అలాగే భూ సమస్య పరిష్కరించడం లేదని హవేళీఘణపూర్ మండలం శమ్నాపూర్ గ్రామానికి చెందిన పట్నం సురేందర్ సోమవారం మెదక్ కలెక్టరేట్ భవనం ఎక్కి హల్‌చల్ చేశాడు. తహసీల్దార్, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా తనకు న్యాయం దక్కడం లేదని సురేందర్ వాపోయాడు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ నగేష్ సురేందర్‌కు నచ్చజెప్పడంతో కిందికి దిగాడు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

మెదక్ అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

● హత్యగా అనుమానం





డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు, వినోద్‌రెడ్డి(ఫైల్)

పాపన్నపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన ఏడుపాయల ఆలయ సమీపంలోని అటవీ ప్రాంతంలో సోమవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా తొగర్‌పల్లికి చెందిన గౌరెల్లి వినోద్‌రెడ్డి(33) వంట పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 7న ఇంట్లోంచి బయటకెళ్లి తిరిగిరాలేదు. ఈ క్రమంలో సోమవారం ఏడుపాయల అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకుని వినోద్‌రెడ్డిగా గుర్తించారు. తలకు బలమైన గాయం ఉండడంతో మృతుడి అన్న హత్యగా అనుమానం వ్యక్తం చేశాడు. మృతుడి అన్న విష్ణువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇంట్లోంచి వెళ్లి శవమయ్యాడు



నరసింహచారి (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రెండునెలల క్రితం ఇంట్లోంచి వెళ్లిన వ్యక్తి శవమై కనిపించాడు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామానికి చెందిన బండోజు నరసింహచారి(53) మతి స్థిమితం తప్పి జనవరి 8న రాత్రి ఇంటినుంచి అదృశ్యమయ్యాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈనెల 9న కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం శివరామపల్లి గ్రామానికి చెందిన మేకల కాపరికి నరసింహచారి చెట్టుకు ఉరేసుకుని కుళ్లిన స్థితిలో కనిపించాడు. ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలపగా.. వారు నరసింహచారి బంధువులతో పాటు పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి అక్కడే పంచానామా నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య రాజమణి, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య



కిరణ్(ఫైల్)

జగదేవ్‌పూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పని చేయకుండా జులాయిగా తిరుగుతున్న తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కొడకండ్ల సత్తయ్య, అమృత దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు కిరణ్ (20) గ్రామంలో హౌజ్ వైరింగ్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తాడు. అయితే కొద్దిరోజులుగా కిరణ్ పనికి వెళ్లకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఆదివారం తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన కిరణ్ సోమవారం జగదేవ్‌పూర్ సమీపంలోని కాళేశ్వరం కెనాల్ పక్కనున్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముందుగా తన స్నేహితులకు ఫోన్‌చేసి నేను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. వారు వద్దని వారించినా వినలేదు. సోమవారం తోటి మిత్రులు వెళ్లే సరికి కిరణ్ చెట్టుకు వేలాడుతూ కనిపించడంతో కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

● నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ.30 వేల జరిమానా

చేగుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఐదేళ్ల జైలుతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ మెదక్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ సెషన్స్ న్యాయాధికారి పీ.లక్ష్మీశారద తీర్పు వెల్లడించారని చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చిట్టోజిపల్లి గ్రామానికి చెందిన చలిమేడ సురేష్ ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించినందుకు పోక్సో కింద కేసు నమోదైంది. సోమవారం నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలుతో పాటు జరిమానా విధించినట్లు ఎస్ఐ చెప్పారు.

పాపను ఎత్తుకెళ్లేందుకు యత్నం

మనోహరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రం నుంచి పాపను ఎత్తుకెళ్లేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించిన సంఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల పరిధి కాళ్లకల్ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. కాళ్లకల్‌లోని అంగన్‌వాడీ కేంద్రం-2కు మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి బాలిక(5)ని ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించాడు. అంగన్‌వాడీ టీచర్ అరవడంతో దుండగుడు పారిపోతుండగా గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అంగన్‌వాడీ టీచర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమ్మర్.. బీ కేర్ ఫుల్

ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.. వడదెబ్బ తగలకుండా చూసుకుందాం



మెదక్ కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయి. వాతావరణం రోజురోజుకూ నిప్పుల కొలిమిలా మారుతోంది. ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల నుంచి 39 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఎండలు ఇంకా పెరుగుతాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో వేసవి కాలంలో ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. అత్యవసర పనులపై బయటికి వెళ్లే వారు వడదెబ్బ బారిన పడకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. వడదెబ్బ లక్షణాలు కనింపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని అంటున్నారు.

ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు..

- తెలుపు రంగు, పలుచటి కాటన్ దుస్తులు ధరించాలి
- బయటకు వెళ్లే ముందు తలకు టోపీ లేదా రుమాలు చుట్టుకోవాలి.
- ఉప్పు కలిపినా మజ్జిగ లేదా గ్లూకోజ్ కలిపిన నీటిని తాగాలి
- ఓరల్ రీ హైడ్రేషన్ కలిపిన నీటిని తాగవచ్చు.
- వడ దెబ్బ తగిలిన వారిని వెంటనే చల్లటి ప్రాంతానికి తీసుకెళ్లాలి

వడదెబ్బ లక్షణాలు

తలనొప్పి, తల తిరగడం
తీవ్రమైన జ్వరం
మత్తునిద్ర, కలవరింతలు, మూర్ఛ
కొంచెం లేదా పూర్తిగా
అపస్మారక స్థితిలోకి వెళ్లడం

చర్మం పాడవకుండా

- మామూలు రోజుల కంటే ఒక లీటర్ నీరు ఎక్కువగా తాగాలి.
- చర్మం పొడిబారకుండా చూసుకోవాలి. డి హైడ్రేషన్ గురికాకుండా శరీరంలో తేమ కోల్పోకుండా చూసుకోవాలి.
- ఎండలోకి వెళ్లేముందు రోజ్ నీటిని ముఖానికి పూసుకుంటే మంచిది.
- నీటితో కలిపిన మాయిశ్చరైజింగ్ క్రీమ్‌ను పూసుకోవాలి.
- ముఖాన్ని ఎక్కువ సార్లు సబ్బుతో కడగ కూడదు.
- వీలైనన్నిసార్లు చల్లటి నీటితో కడుకోవడం మంచిది.

- వడ దెబ్బకు గురి అయిన వారిని తడి వస్త్రంతో శరీరం అంత తుడుస్తూ ఉండాలి
- ఐస్ నీటిలో వస్త్రాన్ని ముంచి శరీరం అంత తుడవాలి. శరీర ఉష్ణోగ్రత 101 ఫారన్‌హీట్ డిగ్రీల కంటే తక్కువ అయ్యేంత వరకు తూడుస్తూ ఉండాలి.
- వడ దెబ్బకు గురి అయినవారు సాధారణ స్థితికి రాకపోతే వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలి
- మంచినీరు ఎక్కువ సార్లు తాగుతుండాలి
- ఎండలో నుంచి ఇంటికి వచ్చిన వెంటనే చల్లని నిమ్మరసం లేదా కొబ్బరినీరు, చల్లనినీరు తాగాలి
- తీవ్రమైన ఎండలో బయటికి వెళ్లినప్పుడు తల తిరుగుడు, ఇతర సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

చేయకూడనివి..

- సూర్యకిరణాలకు, వేడి గాలికి గురి కాకూడదు.
- ఎండ బాగా ఉంటే గొడుగు తీసుకెళ్లడం ఉత్తమం
- నలుపు, మందంగా ఉన్న దుస్తులు వేసుకోకూడదు.
- వడ దెబ్బకు గురి అయిన వారిని వేడి నీటిలో ముంచిన వస్త్రంతో తుడవకూడదు
- ఆసుపత్రికి తీసుకెళ్లడానికి ఆలస్యం చేయకూడదు
- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో ఎండలో వెళ్లకుండా చూసుకోవాలి. ఒక వేళ వెళ్లవలిసి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎండలో నుంచి ఇంటికి రాగానే తీపి పదార్థాలు.. తేనె వంటివి తీసుకోకూడదు.
- శీతల పానీయాలు, మంచు ముక్కలు వంటివి తీసుకుంటే గొంతుకు సంబంధించిన అనారోగ్య సమస్యలు రావచ్చు.

అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి



ఎండల తీవ్రత దృష్టిలో ఉంచుకొని అవసరమైతేనే బయటకు వెళ్లాలి. దూర ప్రయాణాలు మానుకోవాలి. తరచూ నీళ్ల తాగాలి. వాంతులు, విరోచనాలు ఉంటే వైద్యం తీయనుకోవాలి. అలసత్వం చేస్తే కొన్నిసార్లు ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుంది. ఎండల తీవ్రత దృష్ట్యా అన్ని రకాల మందులు ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉన్నాయి.

- డాక్టర్ శివదయాల్,
జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త, మెదక్

పండు.. ఆరోగ్యం దండు



హుస్నాబాద్‌లో పండ్ల కొనుగోలు

హుస్నాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపం నుంచి బయటపడేందుకు పండ్లు, పండ్ల రసాలు ఎంత ఎక్కువగా తీసుకుంటే అంత మంచిది. పండ్లను తీసుకోవడం వల్ల కూడా వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. వేసవిలో శరీరంలో ఉష్ణోగ్రతలు పెరిగి అధికశాతం నీరు చెమట రూపంలో బయటకు పోతుంది. దీనివల్ల శరీరంలో లవణాలు కోల్పోయి నిరసం వస్తుంటుంది. వీటి నుంచి మనకు మనం రక్షించుకోవడానికి పండ్ల రసాలు ఎంతో మేలు చేస్తాయి. ఇప్పటికే పలు చోట్ల పెద్ద ఎత్తున జ్యూస్ సెంటర్లు వెలిశాయి. వేసవిలో లభించే పండ్లను వాహనాల్లో తీసుకవచ్చి విక్రయిస్తున్నారు. వీటి పట్ల ప్రజలు అసక్తి చూపుతున్నారు.

- నిమ్మరసం ఆరోగ్యానికి ఎంతో ఎంతో మేలు చేస్తుంది. ఇందులో విటమిన్ సి కలిగి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.
- కీరదోస వేసవిలో రీహైడ్రెటింగ్ ఏజెంట్‌గా పని చేస్తుంది. చెమట ద్వారా కోల్పోయిన నీటిని, లవణాలను శరీరానికి తిరిగి అందించడంలో చక్కని పాత్ర పోషిస్తుంది.
- ద్రాక్ష శరీరంలో వేడి, నిరసాన్ని తగ్గిస్తుంది.
- వేసవిలో కొబ్బరిబోండాం ఎంతో శక్తినిస్తుంది. పిల్లలను ఆరోగ్యంగా ఉంచడానికి ఉపయోగ పడుతాయి.
- తర్బూజ శరీరంలోని వేడిని తీసి వేస్తుంది. ఇందులో 95.9 శాతం నీరు ఉంటుంది. వేసవిలో చెమటరూపంలో బయటకు వెళ్లే నీటిని తిరిగి పొందేందుకు తోడ్పడుతుంది.
- పుచ్చకాయ(వాటర్ మిలన్) అధిక శాతం నీరు ఉంటుంది. ఇది వేసవిలో దాహార్తిని తీర్చుతుంది.
- చెరుకు రసం వేసవిలో ఆరోగ్యానికి

ఉద్యోగాలు ఇచ్చేవారిలా ఎదగండి

వర్ధమాన ఇంజనీర్లకు ఫైటెక్ ఎంబెడెడ్ డైరెక్టర్ ఉద్బోధ



జ్యోతి ప్రజ్యలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అరుణ కుమార్

పటాన్‌చెరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వర్ధమాన ఇంజనీర్లు ఉద్యోగాల కోసం చూడకుండా, ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని ఫైటెక్ ఎంబెడెడ్ సేల్స్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ సింగ్ ఉద్బోధించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ ఐఓటీ ధోరణులు, ఆవిష్కరణలు' అనే అంశంపై నిర్వహిస్తున్న అధ్యాపక వికాస కార్యక్రమాన్ని (ఎఫ్‌డీపీ) సోమవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ఇంజనీర్లు కేవలం సేవ చేసే వారు మాత్రమే కాదని, వారు కొత్త అవకాశాలు, ఉద్యోగ సృష్టికర్తలని అభివర్ణించారు. దేశం సాఫ్ట్‌వేర్ రంగంలో ముందున్నప్పటికీ, స్వదేశీ హార్డ్‌వేర్ లేదని.. ఎన్నో బహుళ జాతి కంపెనీలకు భారతీయులు నేతృత్వం వహిస్తున్నప్పటికీ, మనదైన విశ్వశ్రేణి ఉత్పత్తులు పెద్దగాలేవని విచారం వెలిబుచ్చారు. ఫైటెక్ ఎంబెడెడ్‌లో లెక్కలేనన్ని వినూత్న ఉత్పత్తుల రూపకల్పన చేయగల మైక్రోప్రాసెసర్ యూనిట్లను ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి మాట్లాడుతూ ఫైటెక్ ఎంబెడెడ్, గీతం మధ్య సహకారం ప్రాముఖ్యతను వివరించారు. ఈ అవగాహనతో గీతం విద్యార్థులకు సాంకేతికత బదిలీ, ఇంటర్న్ షిప్‌లు, ప్రాంగణ నియామకాలకు మార్గం సుగమం చేస్తుందని అభిలషించారు. ఫైటెక్‌తో అవగాహనా ఒప్పందంపై సంతకం చేయబోతున్నట్టు డాక్టర్ శాస్త్రి ప్రకటించారు. కార్యక్రమంలో ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి, ఎఫ్‌డీపీ నిర్వాహకుడు ప్రొఫెసర్ పి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

చెక్ డ్యాంల పరిశీలన



చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న సంస్థ ప్రతినిధులు

నారాయణఖేడ్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ వే ఆఫ్ ముంబై సంస్థ ప్రిన్స్ పైప్స్ సహకారంతో జలసంజీవని విలేజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద మండలం గైర్హాన్‌తండా, సీతారాంతండా శివార్లలో ఒక్కో చెక్‌డ్యాంలతో పాటు చాప్టా.కె శివారులో మరో చెక్ డ్యాంను ఇటీవలే నిర్మించింది. సోమవారం సంస్థ జిల్లా మేనేజర్ శివరాజ్‌నాయక్, ఇన్‌చార్జి అజీజ్ టొంబాలి, ఇంజనీర్ కృష్ణ, క్షేత్ర అధికారులు శ్రీకాంత్, ప్రియాంక పరిశీలించారు. తమ సంస్థ ద్వారా భూగర్భజలాల పెంపుదల, వాన నీటి సంరక్షణ, వ్యవసాయ ఉత్పాదకతను ప్రోత్సహించడంలో భాగంగా మల్టీలేయర్ ఫార్మింగ్, ఆగ్రో హార్టికల్చర్, నర్సరీలు, ఫాంపాడ్‌ల నిర్మాణం తదితర కార్యక్రమాలను చేపడుతున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. విద్యావిభాగం ద్వారా చాప్టా.కె, అబ్బెంద ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను నిర్మించినట్లు వివరించారు.

చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలి

క్రికెట్ అకాడమీ మాజీ చైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్



మాట్లాడుతున్న క్రికెట్ అకాడమీ మాజీ చైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్

మునిపల్లి, మార్చి10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత తరుణంలో చదువు ఒక్కటే ముఖ్యం కాదని, క్రీడల్లోనూ రాణించాలని భారత క్రికెటర్, క్రికెట్ అకాడమీ మాజీ చైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్ అన్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ శివారులోని వోక్సెన్ వర్సిటీలో నూతనంగా క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయనున్న సందర్భంగా సోమవారం యూనివర్సిటీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు స్థలం అనువుగా ఉందన్నారు. ప్రతిభావంతులైన ఆటగాళ్లను భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారి కెరీర్ ప్రారంభంలోనే అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా అకాడమీని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో శిక్షణా కేంద్రాలు నెలకొల్పడం జరిగిందని తెలిపారు. ప్రతిభావంతులైన క్రికెటర్లను వెలుగులోకి తీసుకవచ్చేందుకు ఈ అకాడమీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అంతకు ముందు చాంపియన్ ట్రోఫీలో న్యూజిలాండ్‌పై భారత్ విజయం సాధించడ పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వర్సిటీ స్పోర్ట్స్ అధ్యాపకుడు విశాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి కోవర్టులను తరిమేస్తాం

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

సిద్దిపేట టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో ఉంటూ బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉంటున్న కోవర్టులను గుర్తించి పార్టీ నుంచి తరిమేస్తానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హెచ్చరించారు. సోమవారం సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీలో అనుకోకుండా ప్రమాదం జరిగితే ఇష్టనుసారంగా మాట్లాడుతున్న కల్వకుంట్ల కుటుంబం రంగనాయకసాగర్ టన్నెల్‌లో ప్రమాదం జరిగితే, మాసాయిపేట రైల్వే ఘటనలో ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కొందరు అధికారులు బీఆర్ఎస్‌కు అనుకూలంగా పనిచేస్తున్నారని అలాంటి వారు ఇకనైనా మారి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకవచ్చేందుకు కృషిచేయాలని సూచించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం లక్షల కోట్ల రూపాయలు దోచుకున్నారని మండిపడ్డారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మారినప్పుడే ఆ పార్టీ దుకాణం బంద్ అయిపోయిందని చెప్పానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని మీరు ఎంత అవమానిస్తున్నా, ఓర్పు, సహనంతో చాలెంజింగ్‌గా ముందుకు వెళ్తున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలన్ని నేరువేరుస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ నాయకులు, కార్యాకర్తలంతా సమష్టిగా పనిచేయాలని, స్థానిక సంస్థలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. పార్టీ లైన్ దాటి, బీఆర్ఎస్‌కు పనిచేస్తున్నట్లు నిర్ధారణకు వస్తే మాత్రం త్వరలోనే దేవాలయాల్లో పసుపు బియ్యం ఎత్తేలా, చర్చి, మసీదులలో ప్రమాణాలు చేసే కార్యక్రమం పెట్టుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, నర్సారెడ్డి, తాడూరి శ్రీనివాస్, గూడూరి శ్రీనివాస్, బొమ్మల యాదగిరి, కలీమొద్దీన్, రియాజుద్దీన్, గోపికృష్ణ, గయాసుద్దీన్, ఆలకుంట మహేందర్, వాహబ్, రాషాద్, గ్యాదరి మధు, అర్షద్, వహీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇద్దరు టీచర్లపై సస్పెన్షన్ వేటు

కంగ్టి, మార్చి10 (ఆంధ్రజ్యోతి): కంగ్టి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికలను చితక బాదిన ఘటనలో ఇద్దరు టీచర్లను సస్పెండ్ చేస్తూ డీఈఓ వెంకటేశ్వర్లు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశాల మేరకు వారిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు వివరించారు. కస్తూర్బా విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న రిష అనే బాలికతో పాటు మరో నలుగురు బాలికలు మొక్కలకు నీరు పోయలేదనే సాకుతో గణతం టీచర్ సురేఖ తీవ్రంగా కొట్టారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన జీసీడీఓ సుప్రియ ఇచ్చిన నివేదిక మేరకు గణితం టీచర్ సురేఖతోపాటు పీఈటీ రేణులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని కేజీబీవీ ఎస్‌వో విజయలక్ష్మి తెలిపారు.

అటవీ జంతువుల దాహం.. దాహం

నీళ్లు లేక.. చెత్త చేరిన సాసర్ పిట్లు



చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో చెత్తచెదారంతో నిండిన సాసర్‌పిట్

శివ్వంపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీ ప్రాంతంలో వేల రూపాయలు వెచ్చించి నిర్మించిన సాసర్ పిట్లు నిరుపయోగంగా మారాయి. నీళ్ల లేక చెత్తాచెదారంతో నిండిపోయాయి. దీంతో అటవీ జంతువులు, వన్యప్రాణులు దాహార్తితో అలమటిస్తున్నాయి. నర్సాపూర్ రేంజ్ పరిధి మండలంలోని చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు పలు చోట్ల సాసర్ పిట్లను ఏర్పాటు చేశారు. వీటిల్లో నిత్యం నీరు పోసేలా అటవీశాఖ నిధులు మంజూరు చేసింది. అయితే, స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో వీటిలో నీరు పోసే నాధుడు లేకుండా పోయారు. దీంతో అవి నిరూపయోగంగా మారాయి. అడవుల్లో ఏర్పాటు చేసిన ఈ నీటి తొట్లలో నీరు లేక నెమళ్లు సమీపంలోని పొలాల్లోకి వచ్చి విషపూరితమైన నీటిని తాగి మృతి చెందుతున్నాయి. ఈ విషయమై మెదక్ డీఎఫ్‌వో జోజిని సంప్రదించగా.. వేసవి కాలంలో వన్యప్రాణులకు నీటిని ఏర్పాటు చేసేందుకు నిధులు వచ్చాయని, ఈ సంవత్సరం నిధుల కొరతతో మంజూరు కాలేవని తెలిపారు.



ఎస్పీ రూపేష్ ఉన్న వాహనాన్ని తాడుతో లాగుతున్న పోలీసు అధికారులు

ఎస్పీ రూపేష్‌కు అధికారుల వీడ్కోలు

సంగారెడ్డి క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి నుంచి బదిలీ అయిన ఎస్పీ చెన్నూరి రూపేష్‌కు జిల్లా పోలీసులు, సిబ్బంది సోమవారం ప్రేమ పూర్వక వీడ్కోలు పలికారు. జిల్లా పోలీస్ పెరేడ్‌గ్రౌండ్స్‌లో విధాయిపరేడ్ నిర్వహించారు. అనంతరం గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాతో తనకున్న అనుబంధం ఎన్నటికీ మరువలేనని అన్నారు. అధికారులను, సిబ్బందిని ఎవరినైనా మందలిస్తే, అది విధుల్లో భాగమేనని గుర్తించాలన్నారు. అనంతరం పూలతో అలంకరించిన పోలీస్ వాహనంలో రూపేష్ కుటుంబ సభ్యులను పెరేడ్‌గ్రౌండ్స్ నుంచి కార్యాలయ ఆవరణ వరకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, ఏఆర్ డీఎస్పీ నరేందర్ పాల్గొన్నారు.

మెదక్‌కు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్

రూ.200 కోట్లు మంజూరు
25 ఎకరాల స్థల సేకరణ కోసం కసరత్తు
అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం

మెదక్ అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైంది. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. స్కూల్ నిర్మాణం కోసం రూ.200 కోట్ల నిధులు మంజూరు చేస్తూ.. పరిపాలన అనుమతులు జారీ అయ్యాయని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు.

జిల్లా కేంద్రమైన మెదక్‌తోపాటు రామాయంపేటలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే రెండు చోట్లు స్థలాలలను గుర్తించినట్లు తెలుస్తోంది. దాదాపు 25 ఎకరాల ప్రభుత్వ స్థలంలో భవన నిర్మాణం చేసేందుకు పరిశీలన జరుగుతోంది. ఈ రెండు స్థలాలకు సంబంధించిన వివరాలను రాష్ట్రస్థాయి అధికారులకు నివేదించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం జిల్లాలో చాలా గురుకులాలకు శాశ్వత భవనాలు లేవు. సగానికిపైగా గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పక్కా భవనం లేనప్పుడు బోధన, అభ్యసన కార్యక్రమాల అమలు ఇబ్బందిరకంగా ఉంటుంది. దీనికి దృష్టిలో పెట్టుకొని బడుగు, బలహీన, మైనార్టీల వర్గాలకు ఒకే గొడుగు కిందకు తెచ్చి చదువు చెప్పించే లక్ష్యంతో సమీకృత అంతర్జాతీయ ప్రమాణాలతో భవనం నిర్మించనున్నారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా స్కూల్ నిర్మాణం జరపనున్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించే ప్రాంతంలో దాదాపు పాతికేళ్ల క్రితం నుంచి అక్కడి ఉష్ణోగ్రతలు, వర్షాపాతం, చలి, వేడి గాలుల తీవ్రత తదితర వాతావరణ అంశాలను పరిశీలించి నిర్మించనున్నారు. విద్యార్థులకే కాకుండా బోధన, బోధనేతర సిబ్బందికి అక్కడే క్వార్టర్స్ నిర్మిస్తారు.

5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలన్నీ ఒకే ప్రాంగణంలోకి వస్తాయి. 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులుంటారు. అంతర్జాతీయ ప్రామాణాలతో ఇంగ్లిష్ మీడియం 12వ తరగతి వరకు బోధన అందించనున్నారు. ఈ స్కూల్‌లో సుమారు 2,560 మంది విద్యార్థులకు బోధన అందించే అవకాశం ఉంది. ఈ పాఠశాలల్లో వేర్వేరు బ్లాక్‌లు ఉండనున్నాయి. ప్రతీ స్కేల్‌లో 30 మంది చొప్పున 120 మంది ఉపాధ్యాయులు పని చేయనున్నారు. లైబ్రరీలో దాదాపు 5 వేల పుస్తకాలు, 60 కంప్యూటర్లు ఉండనున్నాయి. అన్ని తరగతుల్లో డిజిటల్ బోర్డుల ద్వారా విద్యాబోధనలు చేయనున్నారు. ప్రతీ డార్మెంటరీ గదిలో 10 బెడ్లు, రెండు బాత్‌రూంలు ఉండే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఈ స్కూల్‌లో చదువుల పేరిట ఒత్తిడి సృష్టించే వాతావరణం కాకుండా క్రీడలు, వినోదం వంటివి కూడా విద్యార్థులకు అందించనున్నారు. ఇండోర్ స్పోర్ట్స్ క్రికెట్, పుట్‌బాల్ మైదనాలు, బాస్కెట్ బాల్ మైదానం, అవుట్‌డోర్ జీమ్, థియేటర్ వంటి సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన కసరత్తు చేస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతోనే..



నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైంది. సీఎం రేవంత్‌రెడ్డి సహకారాలతోనే మెదక్‌కు స్కూల్ కల సాకారం కానుంది. దాదాపు 25 ఎకరాల్లో రూ.200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో భవనం నిర్మాణం జరపాలని యోచిస్తున్నాం. ఇందుకు అనుగుణంగా చర్యలు ప్రారంభించాం. మెదక్ లాంటి వెనుక బడిన నియోజకవర్గంలో విద్యకు పెద్దపీట వేయాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేశా రు. స్థల సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్‌ను కోరాం. స్థలం కేటాయించగానే సంవత్సరంలో నిర్మాణం పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తాం.

- డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు, మెదక్ ఎమ్మెల్యే

అదుపు తప్పి.. పాఠశాల బస్సు బోల్తా

ఐదుగురు విద్యార్థులకు గాయాలు



కొండెంగలకుంట శివారులో బోల్తా పడిన పాఠశాల బస్సు

చిన్నకోడూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు అదుపు తప్పి బోల్తా పడగా, అందులో ఉన్న ఐదుగురు విద్యార్థులకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని కమ్మర్లపల్లి గ్రామపంచాయతీ పరిధి కొండెంగలకుంట వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నకోడూరు మండలం కమ్మర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొండెంగలకుంటలో సోమవారం సాయంత్రం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణంలోని రావూస్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను దింపేందుకు సోమవారం సాయంత్రం మండలంలోని సలేంద్రి నుంచి కొండెంగలకుంటకు వెళ్తుంది. ఈ క్రమంలో కొండెంగలకుంటకు వెళ్లే రోడ్డులో మలుపు వద్ద అజాగ్రత్తగా, అతివేగంగా వెళ్తున్న బస్సు ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న వరి పొలంలో బోల్తా పడింది. దీనితో బస్సులో ఉన్న కొండెంగలకుంటకు చెందిన ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. తీవ్ర గాయాలైన అన్వితోపాటు స్వల్ప గాయాలైన శ్రీహన్, వినయ్‌ను సిద్దిపేటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ ఘటన పై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై బాలకృష్ణ తెలిపారు. రెగ్యులర్‌గా వచ్చే బస్సు డ్రైవర్ రాకపోవడంతో కొత్త డ్రైవర్ బస్సు నడపడంతో ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆరోపించారు.

17న హుస్నాబాద్ అంగడి వేలం

హుస్నాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ వారసంతకు ఈ నెల 17వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు 15వ తేదీ సాయంత్రంలోపు రూ.10 లక్షల ధరావత్ సొమ్ము డీడీ లేదా నగదుగా చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

టెండర్ ప్రక్రియను నిలిపివేయాలి

హుస్నాబాద్ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ముందున్న షాపింగ్ కాంప్లెక్స్ టెండర్ ప్రక్రియను నిలిపివేయాలని సోమవారం బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్ బాబు ఆధ్వర్యంలో కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్‌కు వినతిపత్రాం అందజేశారు. 30 ఏళ్లుగా మున్సిపల్ కాంప్లెక్స్‌లో దుకాణాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నామని, కొత్తగా టెండర్ వేయడం వల్ల తమ కుటుంబాలు రోడ్డున పడుతాయని బాధితులు వాపోయారు.

రేపు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

గజ్వేల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బుధవారం గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్)లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజూమ్ సోమవారం ప్రకనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ముతూట్ ఫైనాన్స్‌లో ఉద్యోగాలకు ఇంటర్, డిగ్రీలలో ఉత్తీర్ణులై, 35 ఏళ్లలోపు వయసున్న అభ్యర్థులు పాల్గొనాలని తెలిపారు. ఎంపికైన వారికి రూ.18వేలకుపైగా వేతనం ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు టీఎస్‌కేసీ మెంటార్ జబ్బార్ 9396421849 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల గడువు పెంపు

సిద్దిపేట రూరల్,మార్చి 10(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు గడువు మార్చి 20 వరకు పొడగించడమైందని సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్‌గౌడ్ సోమవారం తెలిపారు. విద్యార్థులకు ఏప్రిల్ 20న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 6వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4గంటల వరకు 7,8,9,10 తరగతుల ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ మోడల్ స్కూల్ వెబ్‌సైట్‌ను వీక్షించాలని సూచించారు.

ఆర్థిక సహాయం

ములుగు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి ములుగులో తొత్తూరి శివయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి వారి కుటుంబసభ్యులను పరామర్శించి వారికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

స్నేహితురాలి జ్ఞాపకార్థం పరీక్ష ప్యాడ్లు అందజేత

మద్దూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాలలో 2013-14 బ్యాచ్ పూర్వ విద్యార్థులు వారి స్నేహితురాలు ప్రియాంక జ్ఞాపకార్థం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉప్పరోనిగడ్డకు చెందిన ప్రియాంక ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చంద్రభాను, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరెకటిక మహాసభను విజయవంతం చేయాలి

మిరుదొడ్డి,మార్చి10(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మక్కాజీ పిలుపునిచ్చారు. సోమవారం వారు మిరుదొడ్డిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మంగళవారం రవీంద్రభారతిలో జరిగే మహాసభకు సీఎం, మంత్రులు రానున్నట్లు తెలిపారు.

నిరుపయోగం

● ప్రభుత్వ భవనాలకు మోక్షమేదీ?

హుస్నాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన హుస్నాబాద్ పట్టణంలో ఏసీపీ కార్యాలయాన్ని మంత్రి నేడు ప్రారంభించనున్నారు. కానీ, కోట్ల రూపాయలతో నిర్మించిన ఇతర ప్రభుత్వ భవనాలు మాత్రం నిరుపయోగంగా ఉంటున్నాయి. వీటి పట్ల సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో వినియోగంలో లేక కళావిహీనంగా మారుతున్నాయి. ఇప్పటికైనా ఈ భవనాలను వినియోగంలోకి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.

⇨ హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగాన రూ. 2కోట్లతో నిర్మించిన టీచర్ ట్రైనింగ్ సెంటర్ కం టౌన్‌హాల్‌ను 2023 మేలో ప్రారంభించారు. మొదట్లో ఇందులో ఒకటి రెండు సమావేశాలు జరిగాయి. తర్వాత నిర్వాహణ లేక నిరుపయోగంగా మారింది. తుమ్మలు, పిచ్చి మొక్కలు మొలచి కళావిహీనంగా తయారైంది. పందులు, కుక్కలు, పాములకు ఆవాసమైంది.

⇨ మండల పరిషత్ కార్యాలయం వెనుక రూ.50 లక్షలతో ఏడేళ్ల క్రితం గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనేక అడ్డంకుల మధ్య గతేడాది జూన్‌లో పూర్తయ్యింది. కనీస వసతులను కల్పించకపోవడంతో భవనం నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం గ్రంథాలయం ప్రైవేట్ భవనంలో కొనసాగుతుంది.

⇨ హుస్నాబాద్ పట్టణంలోని చావడి వద్ద నిర్మించి రైతుబజార్ భవనాన్ని రెండునెలల క్రితం ప్రారంభించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో రైతుబజార్‌కు, ఫస్ట్‌ఫ్లోర్‌లో ఫంక్షన్ హాల్, సెకండ్‌ఫ్లోర్‌లో కిచెన్, డైనింగ్‌హాల్, స్టోర్‌రూమ్ నిర్మాణం చేశారు. దీనిని వినియోగంలోకి తీసుకరావాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

⇨ హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్మించిన 50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్ర భవనం దాదాపు మూడు నెలల క్రితమే పనులు పూర్తయ్యాయి. ప్రారంభించి వినియోగంలోకి తీసుకరావాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


ప్రారంభమైన రెండేళ్లకే నిర్వహణ లేక మూతపడిన టీటీసీ భవనం


భవన నిర్మాణం పూర్తయిన వసతులు లేక ఉపయోగించని గ్రంథాలయ భవనం


ఇటీవల ప్రారంభించినా వినియోగంలోకి తీసుకురాని రైతు బజార్


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మాతా శిశు ఆరోగ్య కేంద్రం

ఏసీపీ కార్యాలయం.. ప్రారంభోత్సవానికి సిద్ధం


విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్న ఏసీపీ కార్యాలయం

హుస్నాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో రూ. 3 కోట్లతో నిర్మించిన ఏసీపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మంగళవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు.

పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత ఖర్చుతో నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, ఆలయ ఈవో వి.కిషన్‌రావు, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ఫీజును మీ సేవలో దరఖాస్తు చేసుకోవచ్చు

● సందేహాలకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు
● హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్

ఇంటర్వ్యూ



హుస్నాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్ అమల్లో భాగంగా క్రమబద్ధీకరణ ఫీజులో ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జున్‌గౌడ్ సూచించారు. ఎల్ఆర్ఎస్ ఫీజుకు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలోనే కాకుండా మీ సేవలోనూ దరఖాస్తు చేసుకోవచ్చని సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు.

25శాతం రాయితీపై స్పందన ఎలా ఉంది ?

ఇప్పుడిప్పుడే దీనిపై స్పందన వస్తుంది. రాయితీ రాక ముందు 815 దరఖాస్తులకు 65 మంది చెల్లించారు. రాయితీ ఇచ్చిన తర్వాత 5,100 దరఖాస్తులకు 4,130 మందికి సమాచారం ఇచ్చాం. 26 మంది వరకు చెల్లించారు. మొత్తం రూ.16 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఎల్ఆర్ఎస్ చేసుకోవడానికి మున్సిపల్ కార్యాలయానికి రానవసరం లేదు. మీసేవలోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. దీని కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం. 7337347512 నంబర్‌కు ఫోన్‌చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఎల్ఆర్ఎస్ కటాఫ్ తేదీ 26.8.2020 నాటికి లేఅవుట్‌లో 10 శాతం ప్లాట్లు విక్రయిస్తే మిగతా విక్రయించని ప్లాట్లను ప్రస్తుతం 25శాతం రాయితీతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

మున్సిపాలిటీకి ఏడాదికి వస్తున్న ఆదాయం ఎంత? పన్నులు చెల్లించకపోతే తీసుకుంటున్న చర్యలు ఏమిటి ?

ప్రభుత్వ, ప్రైవేట్‌తో పాటు అంగడితో కలిసి దాదాపు రూ.3.50 కోట్ల వరకు వస్తుంది. ఇప్పటివరకు 62 శాతం పన్నులు వసూలు అయ్యాయి. టార్గెట్ రూ.1.73 కోట్లు, ఇప్పటివరకు రూ. 1.06 కోట్లు వసూలు అయ్యాయి. ఇంకా రూ. 67.36 లక్షలు వసూలు చేయాల్సి ఉంది. మార్చి 31 వరకు టార్గెట్‌ను చేరుకుంటాం. పన్నులు చెల్లించని వారికి నోటీసులు జారీ చేశాం. పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి దోహదపడాలని కోరుతున్నాం. నిర్లక్ష్యం చేస్తే నల్ల కనెక్షన్ తొలగించడం వంటి చర్యలు చేపడుతాం.

తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలు?

పట్టణంలో మిషన్ భగీరథ నీరు సరఫరా కానీ రెండు మూడు కాలనీలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నాం. తాగునీటి సమస్య రాకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటున్నాం. దీని కోసం రూ.35 లక్షలు కేటాయించాం. మూడు ట్యాంకర్లను ఏర్పాటు చేశాం.

కంటికి రెప్పలా కాపాడుకుంటాం

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పార్టీకి కొండంత బలమైన కార్యకర్తల కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ, కంటికిరెప్పలా కాపాడుకుంటామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కొమురవెల్లి మండలం లెనిన్‌నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దానరి ప్రభాకర్ కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పార్టీ సభ్యత్వం కలిగి ఉన్నందున రూ.2 లక్షల ఇన్సూరెన్స్ మంజూరైంది. సోమవారం చెక్కును మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు.

ముగిసిన వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు


అగ్నిగుండాన్ని తొక్కుతున్న భక్తులు

రాయపోల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డెపల్లిలో వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. సోమవారం తెల్లవారుజామున భక్తులు అగ్నిగుండాలు తొక్కారు. అనంతరం స్వామివారి విమాన రథోత్సవం ఘనంగా నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

● కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట రూరల్,మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్ గ్రామంలో ఉపాధి హామీ కింద రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు మంజూరయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి, జిల్లా నాయకులు గుర్రం అంజిరెడ్డి, కోడారి మల్లారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు ఎల్లయ్య, నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను నిండా ముంచుతున్న కాంగ్రెస్

● సకాలంలో సాగునీటిని వదలకపోవడంతో ఎండిన పంటలు
● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


కమ్మర్‌పల్లిలో కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మార్చి10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచుతుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. సకాలంలో నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండుతున్నాయని మండిపడ్డారు. సోమవారం దుబ్బాక మండలం కమ్మర్‌పల్లి గ్రామంలోని పంట కాలువలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి దున్నపోతు మీద వానపడ్డట్టుగా ఉందని, ఇప్పటివరకు నీటి నిర్వహణ సక్రమంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు రోడ్డుమీదకు వచ్చినా స్పందించడంలేదన్నారు. తాను ఆరుమాసాల నుంచి ప్రభుత్వం వెంటపడితేగానీ నీటిని వదలలేదన్నారు. నియోజకవర్గంలో పంట కాలువల నిర్మాణాన్ని ఇప్పటివరకు పూర్తి చేయలేదన్నారు. నియోజకవర్గంలోని 30 గ్రామాలకు లబ్ధి చేకూరే కాలువలకు నీటిని సకాలంలో విడుదల చేయలేదన్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల చెరువులు నింపుదామంటే, నీటి విడుదలను ఆపుతామని రాజకీయం చేస్తున్నారన్నారు. ఆయన వెంట నాయకులు ఆర్.రాజమౌళి, ఎల్లారెడ్డి, కిషన్‌రెడ్డి, బాణాల శ్రీనివాస్, భూంరెడ్డి తదితరులున్నారు.

అటవీ కళాశాలలో తేనెటీగలపై అవగాహన


రైతులకు శిక్షణనిస్తున్న ప్రొఫెసర్

ములుగు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ములుగు మండల కేంద్రంలోని అటవీ కళాశాలలో డాక్టర్ పంకజ్ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు తేనెటీగల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తేనెటీగల పెంపకం ఆదక్షిత, అవక్షత ఉపయోగాలు తేనెటీగల ప్రాసెసింగ్ మార్కెటింగ్ వ్యాధుల నివారణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త శ్రీకాంత్, అటవీ జీవవైవిధ్య సంస్థ డాక్టర్ శైలజ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిరంజీవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీమతి సంజన పాల్గొన్నారు.

కాంగ్రెస్ అసమర్థ పాలనతో వచ్చిన కరువు

● ఎండిన పంటపొలాలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇది ప్రకృతి తెచ్చిన దుస్థితి కాదని, కాంగ్రెస్ అసమర్థ పాలనతో వచ్చిన కరువు అని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. సోమవారం చేర్యాలలో బీఆర్ఎస్ నాయకులు ఎండుతున్న పంటలను పరిశీలించి, బాధిత రైతులను పరామర్శించారు. అనంతరం మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, రైతు నాయకుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. గతంలో తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి చెరువులు, కుంటలకు మళ్లించడంతో రికార్డుస్థాయిలో పంటల దిగుబడి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, పుర్మ వెంకటరెడ్డి, శివగారి అంజయ్య, బూరగోని తిరుపతి, మంగోలు చంటి, మానస తదితరులు పాల్గొన్నారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్ వద్ద నిరసన

కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో వెంటనే నింపాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రిజర్వాయర్‌ను సందర్శించి నిరసన చేపట్టారు. నాయకులు కాయిత రాజేందర్‌రెడ్డి, మేరుగు కృష్ణ, పచ్చిమడ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించాలని సీపీఎం ధర్నా

చేర్యాల మండలంలో అన్ని గ్రామాల్లో ఎండిపోయిన వరిపంటలకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు సోమవారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్ మాట్లాడుతూ పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సర్వే చేపట్టి నష్టం అంచనా వేయాలని, ఎకరాకు రూ.50 వేల చొప్పున రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. అనంతరం ఆర్ఐ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

చిన్నకోడూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, పొద్దుతిరుగుడు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని అల్లీపూర్ పీఏసీఎస్ చైర్మన్ సదానందం అన్నారు. చిన్నకోడూరులో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గంగాపూర్ పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గన్నీ బ్యాగుల సమస్యను తీర్చాలి

సిద్దిపేట అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పొద్దుతిరుగుడు పంట చేతికి వచ్చి అమ్ముకుందామని రైతులు మార్కెట్ తీసుకువస్తే గన్నీ బ్యాగులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. సోమవారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ ను సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

శనగ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జగదేవ్‌పూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం వద్ద శనగ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.



సావిత్రీబాయికి ఘన నివాళి

సోమవారం సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా పలుచోట్ల ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. మహిళల విద్యాభివృద్ధికి ఆమె చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. -జగదేవ్‌పూర్



స్వయంపాలన దినోత్సవం

గజ్వేల్ మండల పరిదిలోని కొడకండ్ల గ్రామ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధునాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- గజ్వేల్ రూరల్, మార్చి 10

చర్యలు తీసుకోవాలి

చేర్యాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో అవకతకవలకు పాల్పడుతున్న పలువురు వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని గ్రామ యువకులు సోమవారం ఆలయ ఈవో రామాంజనేయులుకు వినతిపత్రం అందించారు. భక్తుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన వలంటీర్లను విధుల నుంచి తొలగించాలని కోరారు. కోడెలస్తంభం ఆవరణలో డ్రైనేజీ కాలువ పనులు చేపట్టాలని విన్నవించారు. ఏర్పుల మహేశ్, సనాది కరుణాకర్, ఉప్పల వంశీ, ప్రవీణ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బైక్ ఢీకొని బాలికకు గాయాలు

కుకునూరుపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను ఢీకొని బాలికకు గాయాలైన ఘటన లకుడారం గ్రామంలో చోటుచేసుకున్నది. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఓ బాలిక ఆదివారం రాత్రి తన స్నేహితుల ఇంటి వద్దకు వెళ్లి తిరిగి వెళ్తుండగా అదే గ్రామానికి రాచకొండ మధు(23) అతివేగంగా బైకును నడుపుతూ ఆమెను ఢీకొన్నాడు. బాలిక కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. తల్లిదండ్రులు, గ్రామస్థులు యువకుడిని నిలదీయడంతో అతడు తిరిగి వారినే కొట్టేందుకు ప్రయత్నించాడు. తల్లిదండ్రులు సోమవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

మోటార్ సైకిల్ చోరీ

రాయపోల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పొలం వద్ద నిలిపి ఉంచిన మోటార్ సైకిల్ చోరీకి గురైన సంఘటన రాయపోల్ మండలం కొత్తపల్లి వద్ద చోటుచేసుకున్నది. బాధితుని కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రోళ్ల ప్రశాంత్ తన ప్యాషన్‌ప్రో బైక్‌ను ఆదివారం మధ్యాహ్నం తన పొలం వద్ద చెట్టు కింద పార్క్ చేశాడు. సాయంత్రం పొలం పనులు ముగించుకొని వచ్చి చూసేసరికి బైకు కనిపించలేదు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాజీ కో-ఆప్షన్ సభ్యుడి కన్నుమూత


మహమ్మద్ అలీ మృతదేహం

చేర్యాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మండల మాజీ కో- ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ అలీ (80) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి ఆయన పార్టీలో చురుకుగా పనిచేశారు. ఉమ్మడి చేర్యాల మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడిగా పనిచేయడంతో పాటు అందరితో స్నేహపూర్వకంగా మెదిలేవారు. మహమ్మద్ అలీ మృతి పట్ల ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు విచారం వ్యక్తం చేశారు.

నిద్రావస్థలో 'నిఘా'

5వ పేజీ తరువాయి

ప్రధాన జంక్షన్ల వద్ద జరిగిన ప్రమాదాలను గుర్తిస్తున్నారు. కానీ చిన్న జంక్షన్లు, యూటర్న్‌లు, రహదారిపై ప్రమాదాలు జరిగిన తీరును అంచనా వేయలేకపోతున్నారు. పోలీస్ సిబ్బంది చనిపోయినా ఇదే పరిస్థితి నెలకొంది. గుర్తు తెలియని వాహనాల కోటాలోనే మృతులను నమోదు చేయాల్సి వస్తోంది.

కెమెరాల నేలచూపులు..

రాజీవ్ రహదారిని నిరంతరం పర్యవేక్షించాల్సిన సీసీ కెమెరాలు నేలచూపులు చూస్తున్నాయి. వాహనాల ఓవర్‌టేక్, రాంగ్ రూట్ ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని అరికట్టాలంటే సీసీ కెమెరాలతోనే సాధ్యమవుతుంది. కెమెరాలు పనిచేయకున్నా భద్రతా సిబ్బంది ద్వారనైనా కనీసం ప్రధాన జంక్షన్లలో నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది. లేదంటే సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయడమో, కొత్తవి బిగించడమో చేయాలి. ఇదిలా ఉంటే వేగంగా వెళుతున్న వాహనాలకు జరిమానాలు వేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కానీ సీసీ కెమెరాల ద్వారా ప్రమాదాలను నివారించడంపైనా యోచించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా రాజీవ్ రహదారిపై ఒక డీఎస్పీ, ప్రముఖ వ్యాపారి మరణించడంతో ప్రస్తుతం ఈ చర్చ హాట్‌టాపిక్‌గా మారింది.